క్లుప్తంగా

పెదరావూరులో వైద్య పరీక్షలు



తెనాలిరూరల్: పట్టణానికి చెందిన వి కార్డియాక్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని పెదరావూరు గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని జెడ్పీ హైస్కూలు ఆవరణలో నిర్వహించిన శిబిరంలో 500 మందికి సీసీజీ, థైరాయిడ్, షుగర్, గర్భకోశ, రక్త పరీక్షలు ఉచితంగా చేశారు. డాక్టర్ కొత్తమాసు శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ విజయవాణి, డాక్టర్ సురేష్, డాక్టర్ తాజుద్దీన్ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. పెదరావూరు సర్పంచ్ రమాదేవి శిబిరాన్ని ప్రారంభించారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మేలు



తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే తెనాలిలో విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం ముత్తెంశెట్టిపాలెం, చినరావూరుతోట, నందులపేట, 28వ వార్డు పరిధిలోని ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ వంటి టెస్టులను చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేశారు. త్వరలో నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాలకు వారిని తీసుకెళ్లి పరీక్షలు చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ఏఎన్ఎంలు అంకమ్మ, కొండమ్మ, లక్ష్మీ, ప్రసన్న, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భవ ఉచిత రిజిస్ట్రేషన్ క్యాంప్



తెనాలి: కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ దేశంలోని ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు కల్పించే రూ.5 లక్షల ఆరోగ్య బీమాకు ఉచిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అక్టోబరు ఒకటో తేదీన ప్రత్యేక క్యాంపు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా ఆదివారం తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా ఈ రిజిస్ట్రేషను జరుగుతుందని, ఇందుకు చెల్లించాల్సిన రుసుం తమ సంస్థ చెల్లిస్తుందని చెప్పారు. అర్హత కలిగినవారు అక్టోబరు ఒకటిన జరిగే శిబిరానికి ఆధార్‌కు లింక్ చేసిన ఫోన్, ఆధార్ కార్డు నకలుతో రావాలని సూచించారు. గతంలో ఈ-శ్రమ్ కార్డులు గలవారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు.

వైద్యసేవలను వినియోగించుకోవాలి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఇప్పటంలో మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ సేవా సంస్థ అధ్యక్షుడు వంగర సురేష్ మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. సంస్థద్వారా ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడం జరిగిందని అన్నారు. వైద్యశిబిరంలో వైద్యులు వేణుగోపాల రెడ్డి, రవిబాబు, వంశీ, మహేష్, వికాస్, గిరీష్, శ్రీకర్, ప్రసాద్, అమం తదితరులు సేవలందించారు. సుమారు 800 మందికి ఉచితంగా వివిధ పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. వైద్యశిబిరంలో మున్నంగి వివేకానందరెడ్డి, గోపి, తులసీదాస్, అమ్మిశెట్టి వెంకటేష్, గాజుల నగేష్, హరిబాబు, మానవ సేవా సంస్థ సభ్యులు రమేష్, హనుమాన్, రవికుమార్, బాలకృష్ణ, వెంకటాద్రి, సమీర్, సుధాకర్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

మంగళగిరి: యోగాతో మానసిక ప్రశాంతత సాధ్యమని యోగా గురూజీ కిషోర్ తెలిపారు. నగరంలోని మెయిన్‌బజార్‌లోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం ఆంజనేయ ధ్యాన యోగా మండలి ఆధ్వర్యంలో ఉచితంగా అనులోమ ప్రాణ చికిత్స శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు సంకా బాలాజి గుప్తా, మద్దుల ప్రసాద్, తాడికొండ శ్రీనివాసరావు, గాదంశెట్టి రామకృష్ణ, కృష్ణార్జునరావు, రాజారెడ్డి పాల్గొన్నారు.

29న మెగా జాబ్ మేళా

వేమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 29న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జీ ఎంపీడీవో చొప్పర శేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియేట్, ఐటీఐ, డిప్లమా, బీటెక్, డిగ్రీ విద్యార్థులు జాబ్ మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు.

వినాయకుడికి విశేష పూజలు



కొలకలూరు బాపయ్యపేటలో అలంకరణలో గణపతి విగ్రహం



మారీసుపేట శివాలయంలో విద్యాగణపతి అలంకరణ



వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి గాంధీనగర్‌లోని విక్రమార్కుడి వీధిలో అగ్ని వలయంలో అమ్మవారి నృత్యంలో కళాకారుడు

తెనాలిటౌన్/తెనాలి: వినాయక చవితి పండుగ సందర్భంగా పట్టణ, రూరల్ గ్రామాల్లోని వివిధ సెంటర్లలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాల వద్ద భక్తులు విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం విగ్రహాలను ట్రాక్టర్లపై ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు.

- పట్టణ మారీసుపేటలోని చంద్రబాబు నాయుడు కాలనీలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద పూజలు జరిపారు. గణేష్ యూత్, ఫ్రెండ్ షిప్ ఆధ్వర్యంలో సుమారు 1000 మందికి అన్నదానం చేశారు. గత 11 సంవత్సరాల నుంచి ఉత్సవాలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
- మారీసుపేట శివాలయంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి విద్యాగణపతి అలంకరణ చేశారు. ప్రసాద వితరణ చేశారు. దేవస్థాన కమిటీ భక్తులు గ్రంధిసేతు మాధవరావు, కార్యదర్శి పొన్నూరు శశి, కోశాధికారి వరదా వెంకటశేషగిరి రావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.
- రూరల్ మండలం కొలకలూరు బాపయ్యపటలో ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేశారు.
- పట్టణంలోని పలు సెంటర్లలో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. తూర్పు, పశ్చిమ కాల్వల్లో నిమజ్జనం చేశారు.
- కొలకలూరు, నందివెలుగు, కోపల్లె, గుడివాడ గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను కొమ్మమూరు కాల్వలో నిమజ్జనం చేశారు.



మారీసుపేట సీబీఎన్ కాలనీలో గణేష్ విగ్రహం వద్ద పూజలు

పాలడుగు చిరస్మరణీయుడు



పాలడుగు వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళి

తెనాలి: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనుదార్ల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేసిన పాలడుగు వెంకటేశ్వరరావు చిరస్మరణీయులని కొనియాడారు. స్థానిక కొత్తపేటలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్, తెనాలి ఆధ్వర్యంలో సంఘ కార్యాలయంలో వర్ధంతి సభ నిర్వహించారు. సభకు సంఘం అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. గుంటూరు జిల్లా అమృతలూరు మండల గ్రామం మోపర్రుకు చెందిన పాలడుగు వెంకటేశ్వరరావు వ్యవసాయశాఖలో పనిచేస్తూ మాస్టరు స్కేలు రూపొందించినట్టు గుర్తు చేసుకున్నారు, ఏజీ క్యాంటం పొందటానికి కారకులుగా తెలిపారు. ప్రభుత్వం నుండి, వివిధ సంఘాలచేత అనేక సత్కారాలను అందుకున్నట్టు వివరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యవర్గ సభ్యుడు జల్లి గంటయ్య, సహాధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు, గౌరవాధ్యక్షుడు మాతంగి సత్యసాగర్, ఉపాధ్యక్షుడు దైతా వెంకట సోమయ్యాశాస్త్రి మాట్లాడారు. తొలుత వెంకటేశ్వరరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ప్రధాన కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

హిందూ ధర్మాన్ని రక్షించాలి

తెనాలిటౌన్: హిందూ ధర్మాన్ని రక్షించాల్సిన బాధ్యత ధర్మరక్షణ గ్రామ కన్వీనర్లదేనని రాష్ట్ర ధర్మ ప్రచాకర్ మద్దు సాయిరామ్ పేర్కొన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ రామలింగేశ్వరపేటలోని కోదండరామ స్వామి దేవస్థానంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో తెనాలి సబ్ డివిజన్ కన్వీనర్ కడియాల సునీల్‌కుమార్, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, సబ్ డివిజన్ ధర్మప్రచారక్ కొతరపు చంద్రసాయి పాల్గొన్నారు.

అప్పల బాధతో వృద్ధురాలి ఆత్మహత్య

తెనాలిరూరల్: వ్యవసాయంలో నష్టం రావడంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా మహిళా కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడింది. రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు అందించిన వివరాలు.. తెనాలి మండలం గుడివాడ గ్రామానికి చెందిన రుద్రపాటి సరోజిని(62) ఏడెకరాలు కౌలుకు తీసుకుని కుటుంబ సభ్యులతో కలసి వ్యవసాయం చేస్తోంది. వ్యవసాయంలో నష్టం రావడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 21వ తేదీ రాత్రి ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేయగా ఆమె చిన్న కుమారుడు గమనించి తెనాలి జిల్లా వైద్యశాలకు తీసుకెళ్లాడు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు గుంటూరు పంపగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందింది. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అల్లర్లు సృష్టించేందుకు టీడీపీ కుట్ర

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త సురేష్‌కుమార్

తాడికొండ: బాబు అరెస్టును అడ్డుపెట్టుకొని ఏపీలో అల్లర్లు సృష్టించేందుకు టీడీపీ నాయకులు కుట్రలు పన్నుతున్నారని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ ఆరోపించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో పేదవాడికి ఇళ్ల స్థలాలను ప్రభుత్వం కేటాయిస్తే వాటిని అడ్డుకొని తప్పుడు కేసులు వేయించినందుకే పేదల ఉసురు తగిలి జైలు పాలయ్యాడన్నారు. బాబు నిజంగా తప్పు చేయకపోతే విచారణ ఎదుర్కొని తన సచ్ఛీలత నిరూపించుకోవాలని సూచించారు. అధికారం అడ్డుపెట్టుకొని అమరావతిలో బాబు తన సామాజిక వర్గానికి ఈ ప్రాంతాన్ని దోచిపెట్టాలని చూసినందుకే 29 గ్రామాల ప్రజలు ఓడించారని, ఆ తప్పును కప్పిపుచ్చుకునేందుకు అమరావతి ఉద్యమం పేరుతో పెట్టిన డ్రామా కంపెనీ దీక్షా శిబిరాలు వెలవెల బోతున్నాయని చెప్పారు. కుల వాదంతో ఓ సామాజిక వర్గం చేరి దీక్షల పేరుతో చేసిన హంగామా చూసి రాజధాని ప్రాంతంలో ప్రజలు ముక్కున వేలేసుకున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆ డ్రామా కంపెనీని మూసివేస్తే మంచిదని హితవు పలికారు. అధికారం, రాజకీయ ప్రయోజనాల కోసం ఎంతకైనా తెగించే స్వభావమున్న టీడీపీ నాయకులపై నిఘా ఏర్పాటు చేసి అరెస్టు చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. బాపట్ల జిల్లా వేమూరుకు చెందిన 20 ఏళ్ల మణికంఠ బైక్‌పై ఆదివారం మధ్యాహ్నం వెళుతుండగా తెనాలి మండలం కంచర్లపాలెం వద్ద అతడి వాహనాన్ని కారు ఢీ కొట్టి వెళ్లిపోయింది. మణికంఠ కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అటుగా వెళుతున్న వారు 108లో తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం కోసం గుంటూరు పంపారు. గుంటూరు వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యానిమేటర్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



భట్టిప్రోలు: పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని కోళ్లపాలేనికి చెందిన మల్లెమాల మహిళ పొదుపు గ్రూపు సభ్యులు యానిమేటర్ కంచర్ల శ్రీలతపై ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సంఘాలకు రుణం ఇప్పించాలంటే రూ.10 వేలు డిమాండ్ చేస్తోందని వారు ఆరోపించారు. దీనికి తోడు యానిమేటర్ తల్లి కంచర్ల ప్రమీల (ఓలేరు యానిమేటర్) ఇరువురు కలసి ప్రశ్నించిన తమను నానా దుర్భాషలాడుతున్నారని పేర్కొన్నారు. పొదుపు గ్రూపునకు చెందిన రూ. 57 వేల నగదు దుర్వినియోగంపై సమాధానం కోరితే.. దిక్కున్న చోట చెప్పుకోమని అంటున్నారని వాపోయారు. ఈ మేరకు భట్టిప్రోలు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రూప్ సభ్యులు దోవా ఝాన్సీ, బుస్సా నాగరాణి, నీలా మార్తమ్మ, నీలా ఆశా, కంభం భాగ్యలక్ష్మి, బుస్సా రాణి, వైఎస్సార్ సీపీ నాయకులు నీలా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

మేడికొండూరు: హత్య కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. వివరాలు.. మండలంలోని వెలవర్తిపాడు గ్రామంలో దాయాదుల మధ్య గురువారం ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒక వర్గానికి చెందిన మన్నవ జాన్ రత్నం అక్కడికక్కడే మృతి చెందాడు. మన్నవ పుల్లయ్య, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసులో నిందితులు మన్నవ చిన్నబాబు, మన్నవ భరత్ కుమార్, మన్నవ విజయ్ కుమార్, గుడి గుంట్ల ప్రేమ్ కుమార్, మన్నవ రాకేష్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



భట్టిప్రోలు: న్యూలైఫ్ చిల్డ్రన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం భట్టిప్రోలులోని వేణుగోపాల స్వామి ఆవరణలో సాయి కృష్ణ కళావేదిక వద్ద ఉచిత పిల్లల వైద్య శిబిరం నిర్వహించారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 18 సంవత్సరాల వయస్సు కలిగిన చిన్నారులకు ప్రత్యేకంగా ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్ కుప్పా పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు రాధిక, రాజశేఖర్ కుప్పా, కెటీఎస్ శ్రీనివాసరావు, అఖిల్ గారపాటి వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు అందజేశారు. పీఆర్వో జగదీష్ వర్మ, సిబ్బంది కౌసర్, మౌనిక, రజని, అభిలాష, అనూష, యశ్వంత్, బాజీ తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయుడికి విశేష పూజలు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని వీరాంజనేయుడికి ఆదివారం విశేష పూజలు చేశారు. ఉదయాన్నే అర్చకులు స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. అనంతరం అష్టోత్తర, సహస్త్ర నామ పూజలు చేశారు. నాగవల్లీదళాలతో అర్చనలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా సర్వే

డీపీఎంఓ డాక్టర్ రత్న మన్‌మోహన్

మంగళగిరి: ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు డీపీఎంఓ డాక్టర్ రత్నమన్‌మోహన్ తెలిపారు. నగరంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేను ఆదివారం విస్తృతంగా పర్యటించి పరిశీలించి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటి వద్దకే వైద్యం అందించడం జరుగుతుందని చెప్పారు. అనుమానం కలిగిన వారికి ప్రథమ చికిత్స అందించడం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీతో పాటు మరింత వైద్యం అవసరమైతే వెంటనే ఆస్పత్రికి తరలించేలా ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. ఇంటి వద్దకే వైద్య బృందాలు వచ్చి పరీక్షలు నిర్వహిస్తుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఉచితంగా మెరుగైన నాణ్యమైన వైద్యాన్ని ఇంటి వద్దనే అందించడం, అత్యవసరమనుకుంటే ఆరోగ్యశ్రీ కలిగిన ఆస్పత్రులకు రోగులను తరలించి చికిత్స అందించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

నగర పరిధిలోని తొమ్మిది అర్బన్ హెల్త్ సెంటర్ల ఏరియాలలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటా సర్వే ముమ్మరంగా కొనసాగుతుంది. సచివాలయాల వారీగా వైద్య ఆరోగ్య శాఖ ఏఎన్ఎం, ఆశ వర్కర్‌లు, సిబ్బంది ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించి వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. సర్వే 212 వలంటీర్లతో కలసి వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రజలకు సర్వే గురించి వివరాలను వివరించి పరీక్షలు నిర్వహించడంతో పాటు ప్రథమ చికిత్స నిర్వహించి మరింత మెరుగైన వైద్యం అవసరమనుకుంటే ఆస్పత్రులకు రెకమండ్ చేస్తున్నారు. తొమ్మిది సచివాలయాల పరిధిలో సర్వే నిర్వహించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు.

అభయ ప్రధాయినిగా బండ్లమ్మ



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులో వేంచేసిన బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో భాద్రపద మాసం రెండవ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అభయప్రధాయినిగా అలంకరించి, పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్ రెడ్డి, ఆలయ ఈఓ నరసింహమూర్తి సిబ్బంది పాల్గొన్నారు.

బండ్లమ్మ చీరల వేలం ఆదాయం రూ.74,950

పిట్టలవానిపాలెం: బగళాముఖి అమ్మవారి దేవస్థానంలో భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరల బహిరంగ వేలం ఆదివారం నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి నరసింహమూర్తి మాట్లాడుతూ రూ.74,950లు ఆదాయం లభించినట్లు తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మెదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు బుడ్డా భూలక్ష్మి, పెనుగొండ బాలకృష్ణమూర్తి, దేవస్థానం పూజారులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదార్ల సంఘాలకు ప్రభుత్వ ప్రోత్సాహం



అభ్యుదయ రైతులకు సత్కారం

తెనాలి: దేశంలో పది వేల రైతు ఉత్పత్తిదార్ల సంఘాలను ప్రోత్సహించాలన్నది కేంద్ర ప్రభుత్వ ఉద్దేశంగా బీకేఎస్ జాతీయ కార్యవర్గసభ్యుడు జె.కుమారస్వామి చెప్పారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలోని స్వచ్ఛ ఆహార రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలోని కలెక్షన్ సెంటర్, కిసాన్ బజార్‌లో ఆదివారం బలరామ జయంతి/ రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథి కుమారస్వామి మాట్లాడుతూ, రైతులు తాము పండించే పంటను నేరుగా అమ్ముకోకుండా ప్రాసెసింగ్ చేసి విక్రయిస్తే అధిక లాభాలు వస్తాయన్నారు. ప్రాసెసింగ్ యూనిట్ల కోసం 35 శాతం సబ్సిడీతో 50 పైసల వడ్డీతో ప్రభుత్వం రూ.10 లక్షల వరకు రుణాలను సమకూరుస్తోందని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా రైతులు సంఘటితమైతే అన్ని రకాల ప్రోత్సాహకాలు లభిస్తాయని వివరించారు. ఇదే సభలో అభ్యుదయ రైతులు డి.రంగారావు, డి.వెంకట్రావును ఘనంగా సత్కరించారు. రైతుసంఘం సభ్యుడు మీసాల రామకృష్ణ పాల్గొన్నారు.

శరన్నవరాత్రుల్లో భక్తిరంజని



గాయకుల గానాలాపన

తెనాలి: స్థానిక బోసురోడ్డులోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో జరుగుతున్న వినాయక చవితి శరన్నవరాత్రుల్లో భాగంగా ఆదివారం సాయంత్రం భక్తిరంజని నిర్వహించారు. శ్రీరామలింగేశ్వర భక్తసమాజం, శ్రీవెంకటేశ్వర అన్నమాచార్యుల సంకీర్తన బృందం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత కార్యక్రమంలో గాయకులు కొండపి వసుంధర, మారా లలితకుమారి, మాజేటి వాసవి, గుబ్బ లక్ష్మీకుమారి, నంబూరు వినతి, పరుచూరి సుబ్బారావు, చిన్నారులు యశస్విని, దేవిలలిత, భావన, తేజాతులసి, మోల్యశ్రీ వివిధ భక్తిగీతాలను ఆలపించారు. సాయంత్రం ఆరు గంటల్నుంచి తొమ్మిది గంటల వరకు భక్తిరంజని కొనసాగింది. కీబోర్డుపై సాయి, తబలాపై రమణ వాద్యసహకారం అందించారు. సంకీర్తన బృందం కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. సురాబత్తుని కేశవరావు, అందే బాలచంద్రమౌళి, శివజ్యోతి, పిసుపాటి శాస్త్రి పాల్గొన్నారు.

విద్యతో పాటు సేవా దృక్పథం కలిగి ఉండాలి

కేఎల్‌యూ డీన్ డాక్టర్ హనుమంతరావు



ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అభినందిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి

తాడేపల్లిరూరల్: విద్యార్థులు విద్యతో పాటు సేవా దృక్పథం కలిగి ఉండాలని కేఎల్‌యూ స్టూడెంట్ ఎఫైర్స్ డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు పేర్కొన్నారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవడతాయని చెప్పారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పి.శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ 1969లో అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఏర్పాటు చేసిన జాతీయ సేవా పథకం ద్వారా దేశ వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో డీన్ అడ్వయిజర్ డాక్టర్ హబీబుల్లా ఖాన్, వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సాక్ డైరెక్టర్ పి. సాయి విజయ్, అసోసియేట్ డీన్ డాక్టర్ రూతు రమ్య, ప్రోగామ్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.సుప్రియ, పి.సురేష్, జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

- దెబ్బతిన్న క్యాబిన్.. క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్
- స్థానికుల సహకారంతో బయటకు తీసిన వైనం



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ ముందు భాగం

మంగళగిరి: నగరంలోని జాతీయరహదారిపై రోడ్డు ప్రమాదం ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. విజయవాడ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న లారీ మిడ్ వ్యాలి సిటీ అపార్ట్‌మెంట్ వద్దకు వచ్చేసరికి ముందు ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో లారీ క్యాబిన్ దెబ్బతినగా లారీ తోలుతున్న డ్రైవర్ జుబేరా క్యాబిన్‌లో ఇరుక్కుపోయి గంటపాటు విలవిలాడిపోయాడు. స్థానికుల సహకారంతో డ్రైవర్‌ను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

పద్మశాలీయ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



రేపల్లె రూరల్: పద్మశాలీయ పేద విద్యార్థుల అసోసియేషన్ ప్రోత్సహించాలని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు విన్నకోట వెంకటేశ్వర్లు అన్నారు. పద్మశాలీయ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని నయాగరా ఫంక్షన్ హాలులో ఆదివారం పద్మశాలీయ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. గత విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన 45 మంది పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, 70 మందికి పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పి.వెంకట శ్రీనివాసరావు, జొన్నాదుల నాగరాజు, పి.ప్రమోద్‌కుమార్, పట్టెం శ్రీనివాసరావు, పాలిశెట్టి నాగమల్లేశ్వరరావు, డాక్టర్ ఏవీ సుబ్బారావు,నారాయణం రామమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కొరటాల సేవలు ఎనలేనివి

రేపల్లె రూరల్: భూస్వామ్య కుటుంబంలో జన్మించి, విద్యార్థి దశ నుంచే ఉద్యమాలు నడిపిన నేత కొరటాల సత్యనారాయణ సేవలు ఎనలేనివని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు కొరటాల సత్యనారాయణ శత జయంతిని స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. సీపీఎం రేపల్లె డివిజన్ స్థాయి నుంచి రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యుడుగా ఎన్నో ప్రజా ఉద్యమాలలో కొరటాల విజయం సాధించారన్నారు. రేపల్లె నియోజకవర్గం నుంచి 1962, 1978లలో రెండుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారని గుర్తు చేశారు. అప్పట్లోనే చెరుకుపల్లి మండలంలో బుంగపోత రైతులకు సబ్సిడి కిరోసిన్‌పై ఉద్యమం చేసి, వారికి న్యాయం జరిగేలా కృషి చేశారన్నారు. దళిత గ్రామాలలో స్మశానవాటికలు, రహదారులు, విద్యుత్ సదుపాయాల ఏర్పాటుకు చేసిన పోరాటాలలో సఫలీకృతులయ్యారన్నారు. తొలుత కొరటాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.ఆశీర్వాదం, రమేష్, నాగరాజు, మావో, డి.శ్రీనివాసరావు, యు.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.